
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
శనివారం 5 జూలై 2025



మల్లిఖార్జున్ ఖర్గేను కలిసిన జగ్గారెడ్డి

ఆలిండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి శుక్రవారం గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖల అధ్యక్షులు, క్రియాశీలక కార్యకర్తల బహిరంగ సభకు ముఖ్యఅథిగా ఖర్గే హైదరాబాద్‌కు విచ్చేశారు.

-సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, జూలై 4



కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- పలు పాఠశాలలు, హాస్టళ్ల సందర్శన
- విద్యార్థులతో మాట్లాడి

సమస్యలు తెలుసుకున్న జిల్లా పాలనాధికారి

సిద్దిపేట అర్బన్/వర్గల్/ములుగు, జూలై4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, మహాత్మ జ్యోతిబా, జ్యోతిరావు పూలే హాస్టళ్లను కలెక్టర్ హైమావతి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిద్దిపేటఅర్బన్ మండలం పొన్నాల శివారులోని బాలికల గురుకుల పాఠశాలను, కేసీఆర్‌నగర్‌లోని జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను, పట్టణ పరిధిలో ఇస్లామియా కాలేజీలో బాలికల గురుకుల పాఠశాలను, ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న బాలుర గురుకుల పాఠశాలను, ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న బాలుర గురుకుల పాఠశాలను, ఎన్సాన్‌పల్లి గ్రామ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అలాగే శుక్రవారం రాత్రి వర్గల్ మండలంలోని బీసీ బాలిక గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, చౌదర్‌పల్లిలోని బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆమె తనిఖీ చేశారు. ములుగులోని సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు.



ములుగు గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్



నాచగిరి ఆలయ నూతన పాలక మండలి సభ్యులు

నాచగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ

పాలక మండలి ఏర్పాటు

- ఆలయ కమిటీ చైర్మన్‌గా పల్లెర్ల రవీందర్ గుప్తా

వర్గల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలక మండలి ఏర్పాటు శుక్రవారం పూర్తయింది. ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు నేతృత్వంలో సిద్దిపేట డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా పల్లెర్ల రవీందర్ గుప్తాను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్‌తో పాటు సభ్యులు జగ్గయ్యగారి శేఖర్ గుప్తా, దేశపతి ఉషశ్రీ, గాల కిష్టయ్య, కర్రె పద్మ, జగ్గన్నగారి సురేందర్‌రెడ్డి, జేఎస్ తిరుమల్ రావు, రుద్ర శ్రీహరి, కొత్తపల్లి శ్రీనివాస్, చందా నాగరాజుగుప్తా, ఎక్స్ అఫీషియో సభ్యులుగా జగన్నాథచార్యులతో ఎండోమెంట్ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి హాజరయ్యారు. గజ్వేల్, వంటిమామిడి, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విజయ మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీచైర్మన్ నిమ్మ రంగారెడ్డితో పాటు వర్గల్, గజ్వేల్, తూప్రాన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, పలువురు పాల్గొన్నారు.

చేర్యాలలో భవనాల కూల్చివేత

- 50 ఫీట్ల వెడల్పు ప్రామాణికంతో చర్యలు



చేర్యాలలో భవనాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

చేర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట-సిరిసిల్ల 365బీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణ ద్వారా రవాణా సౌకర్యం మెరుగైనప్పటికీ చేర్యాల పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, దుకాణ యజమానులకు కష్టాలు తెచ్చిపెట్టింది. ఇరువైపులా 50 ఫీట్ల వెడల్పు ప్రామాణికంతో గతంలో మార్కింగ్ వేశారు. కొన్నాళ్ల క్రితం 45 ఫీట్ల లోపు కూల్చివేసి డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టారు. విద్యుత్ లైన్, వాటర్ పైప్‌లైన్ చెట్లపెంపకం వగైరావంటి కోసం మిగతా 5 ఫీట్ల నిర్దేశిత ప్రదేశంలోని నిర్మాణాలు తొలగించాలని సూచిస్తూ మునిసిపల్, ఎన్‌హెచ్ అధికారులతో పాటు కాంట్రాక్టర్ ఇటీవల మార్కింగ్ చేశారు. 2 ఫీట్ల మేర స్థలం ఇవ్వడానికి అభ్యంతరం లేదని, ఎక్కువగా ఇస్తే భవనాలు కూల్చివేయాల్సి వస్తుందని సదరు భవన యజమానులు వాపోతున్నారు. వారి అభ్యర్థనను పట్టించుకోని అధికారులు పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారం గాంధీచౌక్ వద్ద పలు దుకాణాలను కూల్చివేశారు. సంబంధిత యాజమానులు వాగ్వాదానికి దిగారు. పారదర్శకంగా పనులు చేపట్టాలని సూచించడంతో హైలెవల్ బ్రిడ్జి నుంచి చదును పనులు మొదలుపెట్టారు.

పక్కాగా 50 ఫీట్లలో నిర్మాణం

రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 50 ఫీట్ల వెడల్పుతో పనులు చేపడతాం. ఏ ప్రదేశమైనా ఒకే మాదిరి ప్రామాణికత పాటించి పనులు పూర్తిచేయిస్తాం. తప్పు చేసినట్టు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

- రాజారాం, ఎన్‌హెచ్ డీఈ

'సిగాచీ' ప్రమాదంలో మృతులకు తుది వీడ్కోలు పలికారు. ఇప్పటివరకు గుర్తించిన 34 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. డీఎన్‌ఏ పరీక్షల ఆధారంగా మృతులను గుర్తించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 15 మృతదేహాలను స్వస్థలాలకు తరలించారు. అంబులెన్సుల్లో ఇద్దరు పోలీసుల ఎస్కార్ట్‌తో బీహార్, ఒడిశా, పశ్చిమబంగా, మహారాష్ట్రలకు తరలించారు. తక్షణ సాయం కింద రూ. లక్ష నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇంకా మార్చురీలో ఉన్న ఐదు మృతదేహాలను గుర్తించేందుకు డీఎన్‌ఏ పరీక్షలు చేస్తున్నారు. వీరితో పాటు ప్రమాద స్థలంలో సేకరించిన శరీర భాగాలు, అస్తికలను మార్చురీలో భద్రపర్చారు. డీఎన్‌ఏ శాంపిళ్లను సేకరించిన పరీక్షల నిమిత్తం పంపించారు.

-పటాన్‌చెరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి)



బూడిదలో మృతదేహాల ఆనవాళ్ల కోసం వెతుకుతున్న విపత్తు సిబ్బంది



కన్నీరే మిగిలింది

34 మంది మృతదేహాల అప్పగింత

- అంబులెన్సుల్లో ఎస్కార్టుతో స్వస్థలాలకు
- తక్షణ సాయం కింద రూ.లక్ష అందజేత
- మార్చురీలోనే మరో ఐదు..
- డీఎన్ఏ పరీక్షల కోసం 14 మంది
- పరిశ్రమను సందర్శించిన 'కూనంనేని'

ప్రమాదంలో ఆచూకీ లభించని 11 మంది కోసం బంధువులు, కుటుంబ సభ్యులు పడిగాపులుకాస్తున్నారు. ప్రమాద సమయంలో వారంతా పరిశ్రమలోనే ఉన్నట్లు నిర్ధారణ కావడంతో కనీసం ఆనవాళ్లయినా దొరుకుతాయని నిరీక్షిస్తున్నారు. మార్చురీలో ఉన్న ఐదు మృతదేహాల్లో తమ వారు ఉన్నారేమోనని ఉద్వేగానికి గురవుతున్నారు. డీఎన్ఏ పరీక్షల కోసం శాంపిల్ ఇచ్చి, నివేదికల కోసం ఎదురుచూస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు బాధిత కుటుంబ సభ్యులను అధికారులు పాశమైలారంలోని 'ఐలా' భవనంలో ఏర్పాటు చేసిన వసతికి తరలించారు. అక్కడ వారు ఎప్పుడు ఫోన్ వస్తుందా అని ఎదురుచూస్తూ కన్నీరు మున్నీరవుతున్నారు.

అడుగంటుతున్న ఆశలు

మార్చురీలో ఐదు మృతదేహాలే ఉండటం, పరిశ్రమలో శిథిలాల తొలగింపు దాదాపు పూర్తవడంతో మిగిలినవారి ఆనవాళ్లయినా దొరుకుతాయనే ఆశలు గల్లంతవుతున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యులు మృతదేహాల లభ్యతపై ఆశలు వదులుకుంటున్నారు. శరీర భాగాలు, అస్తికలు దొరికినా అంతిమ సంస్కారాలు జరుపుతామని వేడుకుంటున్నారు. అధికారులు సైతం చిన్న అవకాశాన్నీ వదులకుండా

మిగతా 7వ పేజీలో



విచారణ చేస్తున్న ఉన్నతస్థాయి బృందం



పరిశ్రమను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు



అమ్మో..చిరుత

- వడ్డేపల్లిలో మళ్లీ ప్రత్యక్షం
- ఆందోళనలో రైతులు, గ్రామస్థులు

రాయపోల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డేపల్లిలో మళ్లీ చిరుత కనిపించడంతో రైతులు, గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన నవీన్ గేదెలను మేపడానికి గట్టు సమీపంలోకి వెళ్లాడు. ఏపుగా పెరిగిన గడ్డిలో చప్పుడు రావడంతో చుట్టుపక్కల గమనించగా చిరుతపులి కనిపించింది. అప్రమత్తమైన అతను తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకుని, గేదెలను తోలుకుని ఇంటికి వెళ్లాడు.

భయం..భయం..

తరుచూ చిరుతపలి కనిపిస్తుండడంతో వడ్డేపల్లి వాసులు భయపడుతున్నారు. రెండున్నరేళ్ల క్రితం అటవీ ప్రాంతంలో లేగ దూడలను చంపి తిన్నది. 40 రోజుల క్రితం గ్రామానికి చెందిన వ్యక్తి కోతుల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రెండు కుక్కలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వెళ్లే సరికి చిరుత పులి రెండు కుక్కలను చంపి తినేసింది. ఏడు నెలల క్రితం రెండు పిల్లలతో కలిసి తిరుగుతూ కనిపించింది. తాజాగా మళ్లీ ప్రత్యక్షమవడంతో ఏ క్షణాన చిరుతపులితో ప్రమాదం వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

8 బ్యారక్‌లతో జిల్లా జైలు

- 30 ఎకరాల్లో రూ.9కోట్లతో నిర్మాణం
- ఖైదీల సామర్థ్యం 415
- చంచల్‌గూడ తరహాలో హై సెక్యూరిటీ బ్యారక్
- ఆగస్టులో ప్రారంభానికి సిద్ధం

సిద్దిపేట క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు పాల్పడి శిక్ష పడి జైలుకు వెళ్లే నేరస్థుల మనసు కుదుటపడే విధంగా అన్ని హంగులు, వసతులతో జిల్లా జైలును నిర్మిస్తున్నారు. సిద్దిపేటలోని ఆర్డీవో కార్యాలయ సమీపంలో కేవలం 25 ఖైదీల సామర్థ్యంతో పాత జైలు కొనసాగుతుంది. అయితే 2018లో జిల్లా జైలు మంజూరైంది. పట్టణ శివారులోని ఎన్సాన్‌పల్లి గ్రామ పరిధిలో మెడికల్ కాలేజీ వెనుక ప్రాంతంలో 30 ఎకరాల స్థలంలో రూ.9కోట్లతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. జైలును నిర్మిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ వారు పనులను పూర్తి చేసి ఈనెలలో జిల్లా జైలుకు అప్పగించనున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఆగస్టులో ప్రారంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.





సిద్దిపేట పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా జైలు

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఏర్పడిన తర్వాత జిల్లాలో 27 పోలీస్‌స్టేషన్లు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో నేరాలతో పాటు ఖైదీల సంఖ్య పెరగడం సబ్‌జైలులో వెసులుబాటు లేకుంటే హైదరాబాద్ చంచల్‌గూడ, కరీంనగర్ జైలు, సంగారెడ్డి జైలుకు ఖైదీలను తరలిస్తున్నారు. ప్రస్తుతం గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ వెనుక భాగంలో నిర్మిస్తున్న నూతన జైలు అన్ని హంగులతో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. 415 ఖైదీలకు సరిపడేలా, పురుష ఖైదీలు 363, మహిళా ఖైదీలు 52 మంది ఉండే విధంగా ఏర్పాటు చేశారు. మొత్తం 8 బ్యారక్‌లను ఏర్పాటు చేశారు. మహిళా ఖైదీల కోసం ప్రత్యేక బ్యారక్‌ను ఏర్పాటు చేశారు. ఈ బ్యారక్‌లో 52 మంది ఖైదీలు ఉండేలా సౌకర్యాలు కల్పించారు. 32 బెడ్లతో ఆసుపత్రి, స్కూలు, లైబ్రరీ, రెండు వంట గదులు, ఖైదీలు పనిచేసుకోవడానికి నాలుగు విభాగాలతో ఒక ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. జైలులో భద్రత కోసం నాలుగు టవర్లను ఏర్పాటు చేశారు. ఈ టవర్లలో ఏఆర్ సిబ్బంది 24

మిగతా 8వ పేజీలో

కలెక్టర్‌గారు చిత్తగించరు..

- లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అవస్థలు
- చిన్నవర్షానికే స్కూలు ఆవరణలోకి వరద నీరు

దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట వార్డులోని ఆదర్శపాఠశాల ఆవరణలోకి చిన్న వర్షానికే వరద నీరు చేరి చెరువును తలపిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బంగారయ్య ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించారు. పాఠశాల పైభాగంలో చెరువు కట్టుకాలువ ఉందని, వర్షం పడ్డప్పుడు వరద నీరు చెరువులోకి కాకుండా పాఠశాల ఆవరణలోకి చేరుతుందని తెలిపారు. ఒక్కోసారి వరద నీటిలో పాములు, తేళ్లు, క్రిమికీటకాలు దర్శనమిస్తున్నాయని విద్యార్థులు భయపడుతున్నారని పేర్కొన్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి, గేటు వరకు సిమెంట్ రహదారి, సమావేశ వేదిక నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

- దుబ్బాక, జూలై 4 (ఆంధ్రజ్యోతి)



వర్షం నీటితో నిండిన లచ్చపేట ఆదర్శపాఠశాల ఆవరణ



వర్షం నీటితో మడుగులా మారిన స్కూల్ ఆవరణలో విద్యార్థుల అవస్థలు (ఫైల్)



డబ్బులు అడిగి.. దూషించడంతో..

● కొడుకును చంపిన తండ్రి


పెద్దశంకరంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కొడుకును చంపిన తండ్రి కేసును పోలీసులు చేధించారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించడంతో విసుగు చెందిన తండ్రి రోకలి బండతో కొడుకును కొట్టి చంపిన విషయం తెలిసిందే. శుక్రవారం పెద్దశంకరంపేటలోని పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుకు సంబంధించిన వివరాలను అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి వివరించారు. పేట మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన తోట సుధాకర్ రోజూ మద్యం తాగి తన తండ్రి నర్సింలుతో గొడవ పడేవాడు. బుధవారం రాత్రి సుధాకర్ తండ్రి నర్సింలుతో 30 వేల రూపాయలు ఇవ్వాలని గొడవ పడడంతో పాటు డబ్బులు ఇవ్వక పోతే తెల్లవారే సరికి చంపుతానని బెదిరించాడు. దీంతో తండ్రి నర్సింలు విసుగుచెంది తన కొడుకుతో ఎప్పటికైనా ప్రాణహాని ఉందని ఇంట్లో ఉన్న రోకలి బండను తీసుకొని పడుకున్న కుమారుడి తలపై బలంగా కొట్టాడు. అయినప్పటికీ సుధాకర్ తన తండ్రిని ఇష్టంవచ్చినట్లు దూషించడంతో నర్సింలు రోకలి బండ తీసుకొని సుధాకర్ తలపై రెండు, మూడు సార్లు కొట్టాడు. దీంతో సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుధాకర్ భార్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందడంతో మద్యానికి బానిస అయినట్లు పేర్కొన్నారు. మృతి చెందిన సుధాకర్‌కు పోలీయో వ్యాధితో లేవలేని స్థితిలో ఉన్న 13 సంవత్సరాల కుమారుడు, మూడు సంవత్సరాల కూతురు ఉందన్నారు. హత్య కేసులో నిందితుడు తోట నర్సింలు(68)ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

నకిలీ బంగారం విక్రయాలు


● ఇటిక్యాల కేంద్రంగా దందా ● అవిపెట్టి బ్యాంకులో గోల్డ్ లోన్‌లు ● ఆరు తులాలు కొని మోసపోయిన బాధితులు

జగదేవ్‌పూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బులు సంపాదించడానికి అలవాటు పడిన కొందరు అమాయక ప్రజలను మోసం చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. నిజమైన బంగారం అని చెప్పి నకిలీ బంగారాన్ని విక్రయించిన సంఘటన జగ దేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో వెలుగుచూసింది. విచిత్రం ఏమిటంటే నకిలీ బంగారానికి ప్రభుత్వరంగ బ్యాంకులు రుణాలు ఇచ్చాయి. ఆ రుణం కట్టాల్సిన సమయం దాటిపోవడంతో రెన్యువల్ చేయలేక మరొకరి చేత డబ్బులు కట్టించి ఆ బంగారాన్ని వారికి అమ్మడంతో అది నకిలీ బంగారం అని తేలింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొన్ని నెలల నుంచి ఉపాధి కోసం ఉప్పల్ వెళ్లి అక్కడే ఉంటున్నాడు. అతడికి వరంగల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. దీంతో ఇద్దరు స్నేహితులుగా మారారు. వరంగల్‌కు చెందిన వ్యక్తి తన దగ్గర ఉన్న నకిలీ బంగారం ఇటిక్యాలకు చెందిన వ్యక్తికి తక్కువ ధరకు విక్రయించారు. సదరు వ్యక్తి ఇటిక్యాల గ్రామంలోని ఇద్దరు వ్యక్తులకు ఆరు తులాల బంగారం విక్రయించగా వారు జగదేవ్‌పూర్‌లోని ఓ ప్రభుత్వ రంగ బ్యాంకులో బంగారం పెట్టి రుణాలు తీసుకున్నారు. ఏడాది దాటినా తీసుకున్న రుణం వాయిదా ప్రకారం చెల్లించకపోవడంతో బ్యాంకు సిబ్బంది వారిని రుణం చెల్లించాలని ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో బంగారం ఇప్పించిన వ్యక్తికి అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వారు తీసుకున్న బంగారం రుణం తీర్చి మరింత రుణం పొందవచ్చని మరో ఇద్దరిని నమ్మించారు. దీంతో ఆ ఇద్దరు బ్యాంకులో రుణం చెల్లించి అదే బ్యాంకులో మళ్లీ బంగారంపై రుణం తీసుకున్నారు. ఇటీవల ఓ వ్యక్తికి బంగారం అవసరం నిమిత్తం పూర్తిగా రుణం చెల్లించి బంగారం తీసుకున్నారు.

కాగా బంగారానికి మరింత కలిపి ఆభరణం చేసుకోవడానికి ఓ దుకాణాదారుడి దగ్గర చూపించగా నకిలీగా తేలింది. దీంతో తను మోసపోయానని గ్రహించి, ఇదే విషయం రెండవ వ్యక్తికి చెప్పాడు. ఈ విషయం రుణం తీసుకున్న బ్యాంకు మేనేజర్ దృష్టికి రాగా నకిలీ బంగారమని తేలిపోయింది. సదరు మేనేజర్ మరో వ్యక్తిని రుణం తీర్చాలని ఒత్తిడి తేగా ఈ నకిలీ బంగారం దందా బయటపడినట్లు తెలుస్తుంది. మోసపోయిన వ్యక్తి శుక్రవారం కొంతమందికి తమ గోడును చెప్పుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై చంద్రమోహన్‌ను వివరణ కోరగా నకిలీ బంగారం విక్రయంతో పాటు బ్యాంకులో రుణం తీసుకున్న విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. కాగా నకిలీ బంగారంపై రుణాలు తీసుకోవడం జగదేవ్‌పూర్ మండల, గజ్వేల్ నియోజకవర్గంలోని పలు బ్యాంకులతో పాటు ప్రైవేటు ఫైనాన్స్‌లలో కూడా జరుగుతుందని ప్రచారం జరుగుతుంది.











మత్తుపదార్థాలు ధ్వంసం



మత్తుపదార్థాలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నర్సాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టుబడ్డ మత్తుపదార్థాలను శుక్రవారం కాగజ్‌మద్దూర్ సమీపంలో ఉన్న బయో ఫ్యాక్టరీలో ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ముస్తాఫా తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్ సీఐ ముస్తాఫా విలేకరులతో మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని నర్సాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్న మూడు కేసులలో 367 గ్రాముల గంజాయి, 20గ్రాముల పప్పిస్ట్రా పౌడర్, రామాయంపేట ఎక్సైజ్ పరిధిలో 333 గ్రాముల గంజాయి, 75గ్రాముల పప్పిస్ట్రా పౌడర్, మెదక్ పరిధిలో 150 గ్రామాల గంజాయి, 1.2కిలోల అల్ప్రాజోలమ్ మత్తు పదార్థాలను డిప్యూటీ కమిషనర్ హరికిషన్, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు నాగేశ్వరరావు, నరేందర్‌రెడ్డి తదితరులు నేతృత్వంలో బయో ఫ్యాక్టరీలో పూర్తిగా ధ్వంసం చేసినట్లు చెప్పారు.

765గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 765గ్రాముల ఎండు గంజాయిని మునిపల్లి పోలీసులు శుక్రవారం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్, స్టేషన్ టీం సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణలోని హైదరాబాద్ వైపు గుట్టుచప్పుడు కాకుండా ఎండు గంజాయి రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ప్రొహిబీషన్, ఎక్సైజ్, జిల్లా అధికారి నవీన్ చంద్ర ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీ చేయగా అందులోప్రయాణిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన వకీల్ యాదవ్ వ్యక్తిపై అనుమానం వచ్చింది. దీంతో వకీల్ యాదవ్‌ను విచారించగా గుట్టు చప్పుడు కాకుండా ఎండు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడు వకీల్ యాదవ్‌పై కేసు నమోదు చేసి, పట్టుబడిన ఎండు గంజాయిని, నిందితుడి వద్ద ఉన్న మొబైల్‌ను స్వాధీనం చేసుకుని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీలో ఎక్సైజ్ ఎస్సైలు హనుమంత్, అనుదీప్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

చేర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న ఇన్నోవా కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన చేర్యాల పట్టణ శివారు అయ్యప్పస్వామి దేవాలయ సమీపంలోని డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో జరిగింది. ఈమేరకు వివరాలిలా ఉన్నాయి. మద్దూరు మండలం నర్సాయపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరి నర్సింహారెడ్డి (60) ద్విచక్రవాహనంపై చేర్యాల పట్టణంలో స్థానిక అయ్యప్ప దేవాలయ సమీపంలోని డివైడర్ వద్ద యూటర్న్ చేసుకుంటున్నాడు. ఇంతలో సిద్దిపేట నుంచి వేగంగా వచ్చిన ఇన్నోవా కారు ఢీ కొట్టడంతో నర్సింహారెడ్డి కిందపడి తలకు తీవ్రగాయమై రక్తస్రావం జరిగింది. చుట్టుపక్కలవారు చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యసేవలు చేపట్టేలోగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. కుటుంబీకులు చేర్యాల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా కొన్నాళ్లక్రితం చేపట్టిన డివైడర్లలో ఏర్పాటుచేసిన గ్రిల్స్ కారణంగా అవతలి వైపు ప్రయాణించేవారి వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులు చొరవ వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యామ్నాయచర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మేకలు కాసేందుకు వెళ్లి..

టేక్మాల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండల కేంద్రమైన టేక్మాల్‌లో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బాజ విఠల్ (31)మేకలను మేపేందకు రోజు మాదిరిగా వెళ్లాడు. మేకలను చిన్న చెరువులో కడుగుతున్న క్రమంలో వాటిని చెరువులో నుంచి పైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విఠల్ చెరువులో మునిగిపోయాడు. పక్కనే ఉన్న మరో వ్యక్తి చూసి చేపలను పడుతున్న వారిని పిలువగా వారు చెరువులో సుమారు గంటకు పైగా అతనికోసం గాలించి, బయటకు తీశారు. అతడు అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

వాహనం ఢీకొని.. వృద్ధురాలి మృతి

మెదక్ అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు రాత్రి గాంధీనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు (70) వాహనం ఢీకొని మృతి చెందింది. ఆమె వివరాల తెలిసిన వారు 8712657913, 8712657878 ఈ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ మహేష్ తెలిపారు.



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటొకొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్టు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.



గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?

ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో చైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స, కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హైకోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.



జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, ఆర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/దోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలోమీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

అసైదులా..

కులమతాలకతీతంగా మొహర్రం

- గ్రామాల్లో పీర్ల సందడి
- మంట చుట్టూ అలవా ఆటలు
- రేపు పీర్ల ఊరేగింపు

జగదేవ్‌పూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం సందడి గ్రామాల్లో మొదలైంది. ఉమ్మడి జిల్లాలో పీర్ల పండుగగా.. కుల, మత భేదాలు లేకుండా హిందూ, ముస్లింలు కలసి నిర్వహిస్తారు. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా మొహర్రానికి తమ సొంత గ్రామాలకు తిరిగి వస్తారు. చివరి రోజైన ఆదివారం పీర్ల ఊరేగింపును పెద్దఎత్తున నిర్వహించనున్నారు.

షర్బత్ పంపిణీ

చరిత్ర ప్రకారం.. మొహర్రం మాసం ఇస్లామిక్ నూతన సంవత్సరం ఆరంభాన్ని సూచిస్తుంది. పది రోజుల పాటు జరిగిన యుద్ధంలో ఇమామ్ హుస్సేన్ వీరమరణం పొందారని నమ్ముతారు. ఆయనకు శాంతి కలగాలని ముస్లింలు మొహర్రం నెలలోని తొమ్మిది, పదో రోజుల్లో ఉపవాస దీక్షలు చేపడతారు. ఈ సమయంలో ఎటువంటి వేడుకలు చేయరు. ఇమామ్ హుస్సేన్ కుటుంబ సభ్యులు కర్బలా మైదానంలో నీరు లేక అలమటించిన దుర్భర పరిస్థితిని స్మరించుకుంటూ, అటువంటి కష్టాలు ఎవరికీ రాకూడదనే ఉద్దేశంతో షర్బత్ తయారుచేసి పంపిణీ చేయడం ఆనవాయితీ. ఈ సంప్రదాయం ప్రకారం, మొహర్రం రోజున గ్రామాల్లోని ప్రధాన వీధులతో పాటు, పీర్లను ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో షర్బత్ తయారుచేసి ప్రజలకు పంచుతారు. కొన్నిచోట్ల బెల్లం పంపిణీ చేస్తారు. ఇది త్యాగం, కరుణకు ప్రతీకగా నిలుస్తుంది.

వారం ముందు నుంచే సందడి..

మొహర్రానికి వారం రోజుల ముందు పీర్లను నిలబెట్టడం ఆనవాయితీ. చాలా గ్రామాల్లో హిందువులే ఎక్కువగా జరుపుతుంటారు. వారం రోజుల ముందు పీర్లను నిలబెట్టి, ప్రతిరోజూ రెండు మూడు పీర్లను లేపుతూ, భక్తిశ్రద్ధలతో ఎత్తుకొని ఊరేగిస్తారు. అల్వా చుట్టూ తిరుగుతూ ఆడిస్తారు. జూలై 6 ఆదివారం మొహర్రం నిర్వహించనున్నారు. ఆరోజు అన్ని పీర్లతో కలిసి గ్రామమంతా భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పీర్లను నిలబెట్టగా, రాత్రి సమయంలో ఆల్వా ఆటలతో సందడి నెలకొంది. ఆదివారం పీర్లను జరపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌లో నిలబెట్టిన పీర్లు

అలవా ఆట.. ప్రత్యేక ఆకర్షణ

పీర్లు అనగానే అలవా ఆట అందరికీ గుర్తుకొస్తుంది. కట్టెలను ఒకచోట చేర్చి, వాటిని మండించి, ఆ మంట చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఆడటం ఈ పండుగలో ప్రధాన ఆకర్షణ. ముఖ్యంగా యువకులు ఈ అలవా ఆటల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. పీర్ల పండుగ జరిగే చివరి మూడు రోజుల పాటు, ప్రతీ రాత్రి గ్రామస్థులంతా ఒకచోట చేరి అలవా ఆడతారు.



శివ్వంపేటలో నిర్వహిస్తున్న పీర్ల ఊరేగింపు

శివ్వంపేటలో పీర్ల ఊరేగింపు

శివ్వంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిదో రోజు సందర్భంగా శుక్రవారం శివ్వంపేట, గూడూరులో పీర్లను డప్పుచప్పులతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు పీర్లకు కుడుకలు, మలీద ముద్దలు, దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. పదో రోజైన ఆదివారం పీర్లను ఊరేగింపుగా తీసుకువెళ్లి స్థానిక పెద్దచెరువులో నిమజ్జనం అనంతరం పీర్ల పండుగ ముగుస్తుందని నిర్వాహకులు అబ్దుల్ అజీజ్ తెలిపారు.

ఉపాధ్యాయుడి తాపీ మేస్త్రీ అవతారం

దౌల్తాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తను బోధించే పాఠశాలలో తరగతి గది మెట్లు పగుళ్ల ఏర్పడడంతో ఉపాధ్యాయుడు తాపీమేస్త్రీ అవతారం ఎత్తాడు. దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకున్నది. శుక్రవారం గాజులపల్లి పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు నర్సింహులు సిమెంట్, ఇసుక కలిపి తాపీతో మెట్లను చదును చేశారు. దీంతో తోటి ఉపాధ్యాయులు త్యాగరాజు, నవీన్‌రెడ్డి, రజిత,జ్యోతి, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయుడి సేవకు సలాం కొట్టారు.



తాపీతో మెట్లను సరిచేస్తున్న ఉపాధ్యాయుడు నర్సింహులు

సిద్దిపేట డెంటిస్ట్‌కు అంతర్జాతీయ గుర్తింపు

రువాండా యూనివర్సిటీ నుంచి ఎగ్జామినర్‌గా ఆహ్వానం



ప్రొఫెసర్ డాక్టర్ అరవింద్

సిద్దిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ ప్రొఫెసర్, డెంటిస్ట్ డాక్టర్ అరవింద్‌కుమార్‌కు మూడోసారి అరుదైన అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సౌత్ ఆఫ్రికాలోని మెడికల్ హెల్త్‌సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ రువాండా (స్కూల్ ఆఫ్ డెంటిస్ట్రీ, కాలేజ్ ఆఫ్ మెడిసిన్ అండ్ హెల్త్‌సైన్స్) నుంచి బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీకి సంబంధించిన ఫైనల్ పరీక్షల నిర్వహణకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా ఆయనకు ఆహ్వానం అందింది. ఈ నెల 7 నుంచి 12 వరకు జరిగే ఈ పరీక్షల్లో డాక్టర్ అరవింద్‌కుమార్ పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి రువాండాకు వెళ్లడం పట్ల సిద్దిపేట వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట ఖ్యాతిని చాటుతున్న డాక్టర్ అరవింద్‌కుమార్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు.

అందోలువాసికి డాక్టరేట్



గడ్డం నాగేందర్

జోగిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అందోలు మండలం నేరడిగుంట గ్రామానికి చెందిన గడ్డం నాగేందర్‌కు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. తెలంగాణ ఉద్యమం-పత్రికల పాత్ర అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు గానూ హెచ్‌సీయూ తెలుగు విభాగం నుంచి ఈ గౌరవం లభించింది.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు 220 మంది హాజరు

నంగునూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశానికి శుక్రవారం 220 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్లు రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. ర్యాంకుల ఆధారంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరేందుకు మండలంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్లాన్ ప్రకారమే ఇల్లు నిర్మించాలి

మెదక్ జిల్లా హౌసింగ్ శాఖ పీడీ మాణిక్యం

నర్సాపూర్, జూలై 4(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులు సూచించిన విధంగా, నిర్దేశించిన ప్లాన్ ప్రకారమే చేపట్టాలని మెదక్ జిల్లా హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) మాణిక్యం స్పష్టం చేశారు. అలా చేస్తేనే లబ్ధిదారులకు సకాలంలో నిధులు అందుతాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ వచ్చిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన పలు సూచనలు చేశారు.

ఆస్పత్రుల్లో విద్యుత్ సమస్యలు రావొద్దు

విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సీఈ కామేశం

జహీరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ కామేశం స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, అక్కడ విద్యుత్‌పరమైన సమస్యల గురించి ఆరా తీశారు. ఇటీవల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి, ఫోన్ టార్చ్ వెలుగులో వైద్య సేవలు అందించిన విషయంపై ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, ఎలక్ట్రీషియన్, విద్యుత్ శాఖ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని ఆస్పత్రిలో పనిచేసే ఎలక్ట్రీషియన్లు విద్యుత్‌పరమైన సమస్యలుంటే ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడితే అందరం ప్రమాదంలో పడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

కన్నీరే మిగిలింది..

(5వ పేజీ తరువాయి)

ఇంకా వెతుకుతున్నారు. బూడిదలోనూ అవశేషాలు, డీఎన్‌ఏ కోసం వెతుకుతున్నారు.

కన్నీళ్లతో స్వస్థలాలకు

మృతదేహాలతో కన్నీటిపర్యంతమై బాధిత కుటుంబాలు అంబులెన్స్‌ల్లో స్వస్థలాలకు ప్రయాణమయ్యారు. రెండు రోజులుగా గుండెలవిసేలా రోదించిన వారు మృతదేహాలను స్వాధీనం చేసుకుంటూ తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. బరువెక్కిన హృదయాలతో వెళ్లిపోయారు. ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని వందల కిలోమీటర్లు దాటి వచ్చి.. విగత జీవులుగా మారి స్వస్థలాలకు వెళ్లడం ప్రతీ ఒక్కరిని కదిలించింది. చెమర్చిన కళ్లతో అధికారులు, పోలీసులు, వైద్య సిబ్బంది మృతదేహాలకు తుది వీడ్కోలు పలికారు. ఎస్కార్ట్‌గా వెళ్లిన కానిస్టేబుళ్లు దహన సంస్కారాలు అయ్యేంత వరకు ఉండి అక్కడి గ్రామ పెద్దలు, పోలీసు అధికారులకు సమాచారం అందించి తిరిగిరానున్నారు. నేడు మరిన్ని డీఏన్ఏ నివేదికలు వచ్చే అవకాశం ఉన్నందున మార్చురీలో ఉన్న ఐదు మృతదేహాలను సైతం కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

39కి చేరిన మృతుల సంఖ్య

మృతుల సంఖ్య 39కి చేరిందని కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. పటాన్‌చెరు ధృవ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహారాష్ట్రకు చెందిన భీంరావు శుక్రవారం మృతిచెందారు. ఇంకా 23 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి బృందం సీఎస్ ఆధ్వర్యంలో పరిశ్రమను సందర్శించింది. సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు.

పరిశ్రమల్లో భద్రతను సమీక్షించాలి : కూనంనేని

పటాన్‌చెరు రూరల్, జూలై 4: సిగాచి ప్రమాదంతో గుణపాఠం నేర్చుకుని భవిష్యత్తులో ఇంత దారుణమైన దుర్ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ శాసనసభా పక్ష నాయకుడు కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ఎన్.సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం పటాన్‌చెరు ధృవ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికుల భద్రత గాలికి వదులుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

కంది, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తమకు న్యాయవాదులు లేరని అర్జీ పెట్టుకున్న ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం శుక్రవారం కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని అన్ని బ్లాకులను, ఖైదీల బ్యారక్‌లు, గదులు, బాత్‌రూమ్‌లతో పాటు జైలు ఆవరణలో తిరిగి పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజనాన్ని ఆమె రుచి చూశారు. అనంతరం ఖైదీలతో ఆమె మాట్లాడుతూ న్యాయవాదులు లేనివారు న్యాయసేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. వారి తరఫున న్యాయవాదులను నియమిస్తామన్నారు. ఈ తనిఖీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయపోల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రావు శుక్రవారం తెలిపారు. దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ వద్ద గల 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటనెన్స్‌లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

సిద్దిపేట రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) :సిద్దిపేట రూరల్ నూతన తహసీల్దారుగా సీహెచ్.స్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ రాజేశం, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులు కృషి చేస్తేనే సర్కారు బడులపై నమ్మకం: డీఈవో

దౌల్తాబాద్,జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల కృషితోనే ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు నమ్మకం కలుగుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యాబోధన, పాఠశాలల్లో సమస్యలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

మిరుదొడ్డి,జూలై4(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం ధర్మారం పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌తో పాటు డీపీవోకు పదిరోజుల క్రితం ఫిర్యాదు చేసిన తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ఎంపీవో జహీరోద్దిన్‌లు గ్రామంలో గ్రామసభను నిర్వహించి విచారణ చేపట్టారు. గ్రామస్థులు గ్రామంలో నెలకొన్న సమస్యలపై, కార్యదర్శి నిర్లక్ష్యంపై అధికారులకు విన్నవించారు.

మర్రిముస్త్యాలలో..

కొమురవెల్లి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి రాజమణి మా గ్రామానికి వద్దంటూ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం మర్రిముస్త్యాల గ్రామాన్ని డీపీఎల్‌పీవో మల్లికార్జున్ రెడ్డి సందర్శించి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులతో మాట్లాడివివరాలు తెలుసుకున్నారు.

50 గదుల సత్రం పనుల పరిశీలన

చేర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిధిలో చేపట్టిన 50గదుల సత్రం భవన నిర్మాణం పనులను ఆలయ ఈవో అన్నపూర్ణ, పంచాయత్‌రాజ్‌శాఖ డీఈ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి పరిశీలించారు. త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేసి ఆలయానికి అప్పగించాలని ఈవో అన్నపూర్ణ పంచాయత్‌రాజ్ అధికారులను కోరారు. మల్లన్న ఆలయ వీరశైవాగమ పాఠశాలకు చెందిన 75మంది విద్యార్థులకు సనత్‌నగర్‌కు చెందిన భక్తుడు జ్వాల సత్యనారాయణ శుక్రవారం ఈవో అన్నపూర్ణ చేతులమీదుగా వస్త్రాలను విరాళంగా అందజేశారు.

మల్లన్నను దర్శించుకున్న ఖమ్మం ఏసీపీ

చేర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయాన్ని శుక్రవారం ఖమ్మం ఏసీపీ మహేశ్ కుటుంబసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ స్వామివారి ప్రసాదం చిత్రపటం అందించి వేదాశీర్వచనం చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

గజ్వేల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈనెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాణే పరిశ్రమ వద్ద సీఐటీయూ నాయకులతో కలసి దేశవ్యాప్త సమ్మె ప్రాధాన్యతను తెలియజేసే బుక్‌లెట్‌ను శుక్రవారం ఆవిష్కరించారు.

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు

నంగునూరు,జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదివితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సిద్దిపేటకు చెందిన ప్రముఖ శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గట్ల మల్లాల హైస్కూల్లో కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరంలో 10వ తరగతిలో 450 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులను సత్కరించారు.

పాములు ప్రకృతి నేస్తాలు

దుబ్బాక, జూలై4(ఆంధ్రజ్యోతి): పాములు ప్రకృతినేస్తాలని ధర్మాజీపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం సాదత్ అలీ అన్నారు. శుక్రవారం పాఠశాలలో పాములను పట్టే వారితో పాముల ప్రదర్శనను విద్యార్థుల ఎదుట ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో పాటుకాటుకు గురైనా అనేక మంది ప్రాణాలను కోల్పోతున్నారని తెలిపారు. విషరహిత, విషం ఉన్న పాములపై విద్యార్థులకు వివరించారు. పాముకాటు వేసినప్పుడు తీసుకునే జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి

● జిల్లాలో ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు



కలెక్టరేట్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హైమావతి



కోహెడలో దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 4: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తితో నేటి యువత ఉద్యమించాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. సిద్దిపేట కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, అధికారులు నాగరాజమ్మ, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో..

సిద్దిపేట అర్బన్/చేర్యాల/కొమురవెల్లి/జగదేవ్‌పూర్/కోహెడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఎం, గొర్ల మేకల కాపరుల సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రాళ్ల బండి శశిధర్, ఏలేటి యాదగిరి మాట్లాడుతూ పేదల కోసం, భూమి కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిన కొమురయ్య స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చేర్యాలలోని అంగడిబజారువద్ద కురుమ సంఘం నాయకులు, సీపీఎం కార్యాలయంలో నాయకులు కొంగరి వెంకట్‌మావో తదితరులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొమురవెల్లి మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో కొమురయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్, కురుమ సంఘం రాష్ట్ర నేత కామల్ల భూమయ్య, సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు బట్టు దయానంద్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కోహెడ మండల కేంద్రంలో మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో కొమురయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా మంత్రి ఇలాఖాలో వైద్యానికి సుస్తీ

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



భూంపల్లి పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసి వైద్యుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, జూలై4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్‌జిల్లా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఇలాఖాలో వైద్యసేవలకు సుస్తీ చేసిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలోని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి యాదవసంఘం ప్రారంభించడంతో పాటు ప్రాథమిక, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కంప్యూటర్లను ప్రారంభించారు. పీహెచ్‌సీ ప్రహరీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భూంపల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రులను నిర్లక్ష్యం చేయడంతో రోగులు రాక వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి ఆరోగ్యశాఖమంత్రి ఆసుపత్రులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈవో అంజాగౌడ్, దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాస్, నాయకులు ఉన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

దౌల్తాబాద్,జూలై 4(ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం దొమ్మాటలో చాముండేశ్వరీ గురదత్త పీఠం శ్రీరామ్ చరణ్ శర్మ గురూజీ ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. శుక్రవారం ఫైనల్‌లో దొమ్మాట, దుబ్బాక జట్లు పోటీపడగా ఉత్కంఠభరితమైన పోరులో దొమ్మాట జట్టు విజేతగా నిలిచింది. మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించిన ఎమ్మెల్యే విజేత జట్టుకు రూ.20వేలు, రన్నరప్ దుబ్బాక జట్టుకు రూ.10 వేల విలువైన చెక్కులను అందజేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేస్తా : పల్లా

చేర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే లేకుండా జనగామ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాల పంపిణీ చేపట్టడం తగదని, కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొటోకాల్ విరుద్ధంగా ఎంపీ వచ్చి పంపిణీ చేయడం సరైన పద్ధతి కాదని, అందుకు కారణమైన అధికారుల తీరుపట్ల ఫిర్యాదు చేస్తానన్నారు. సభాగౌరవం పాటించకుండా వేదికపై కాంగ్రెస్ కార్యకర్తలతో నింపి పార్టీ కార్యక్రమంలా చేపట్టడం ఖండిస్తున్నామన్నారు.

గ్రీష్మ నవరాత్రోత్సవాల్లో సామూహిక కుంకుమార్చన



చేర్యాల: సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

చేర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని దుర్గమ్మ ఆలయంలో కొనసాగుతున్న గ్రీష్మ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సామూహిక కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధికసంఖ్యలో హాజరై అమ్మ వారికి కుంకుమార్చన చేవారు. మర్మాముల రామచంద్రమూర్తి తదితరుల వేదమంత్రోచ్చారణ లతో అమ్మవారికి శాస్త్రోక్తయుక్తంగా విశేషపూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మహాఅన్నప్రసాద వితరణ చేశారు.

మహంకాళి బోనాలు ప్రారంభం

గజ్వేల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని సుప్రసిద్ధ మహంకాళీ ఆలయంలో ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, చండీపారాయణను నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీవో చంద్రకళ పరిశీలించి, ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆర్డీవోకు వేద ఆశీర్వచనాన్ని అందజేశారు.

కష్టపడితే విజయం వరిస్తుంది: డీవైఎస్‌వో



నేషనల్ లెవల్ ప్రాబబుల్స్‌కు ఎంపికైన చైతన్యశ్రీకి సన్మానం

సిద్దిపేట కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధంగా కష్టపడితే విజయం వరిస్తుందని డీవైఎస్‌వో వెంకట నర్సయ్య పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా జూనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ టీమ్ సెలక్షన్‌ను సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాంతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట నర్సయ్య మాట్లాడుతూ చదువుతో పాటుగా క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలని, సిద్దిపేట నుంచి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు రావాలని ఆకాంక్షించారు.

జిల్లా జూనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ టీమ్ ఎంపిక

సిద్దిపేట జిల్లా జూనియర్ గర్ల్స్ ఫుట్‌బాల్ టీమ్ ఎంపిక పూర్తయ్యిందని సిద్దిపేట సెలక్షన్ కమిటీ సభ్యులు అక్బర్ నవాబ్, నర్సింములు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట ఫుట్‌బాల్ గ్రాస్‌గ్రౌండ్‌లో నిర్వహించిన సెలక్షన్స్ జిల్లా వ్యాప్తంగా 35 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో వారి సామర్థ్యాన్ని పరిశీలించి 20 మంది క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఈ నెల 8 నుంచి ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టీమ్ ప్రాబబుల్స్ ఎంపికైన సిద్దిపేట క్రీడాకారిణి చైతన్యశ్రీని డీవైఎస్‌వో వెంకట నర్సయ్య, స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాం సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ తరఫున ఘనంగా సన్మానించారు.

ఎన్ని అడ్డంకులెదురైనా లక్ష్యాన్ని సాధించాలి



బాలసదనం లోని విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఏసీపీ రవీందర్

సిద్దిపేట క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధనలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా గమ్యం చేరే వరకు ముందుకు సాగాలని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి సూచించారు. సిద్దిపేట పట్టణంలోని బాల సదనాన్ని శుక్రవారం సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి సందర్శించారు. బాలసదనంలో ఉన్న పిల్లలను ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వారికి నోట్ బుక్స్, పెన్నులు, పండ్లు అందజేశారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మీ అందరికీ మేమున్నామని భరోసా కల్పించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా వెంటనే ఫోన్ చేసి తెలపాలని సూచించారు. గొప్ప అధికారులు కూడా గతంలో పేద కుటుంబాల నుంచే వచ్చినవారేనని, మీరు కూడా ఇష్టపడి చదువుకొని మీ లక్ష్యాన్ని నెరవేర్చుకుని మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఏసీపీ శిశు గృహ హోమ్ ను సందర్శించి అక్కడి పిల్లల బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఫీడింగ్ విషయంలో ఏదైనా అవసరం ఉంటే తనకు ఫోన్ చేసి తెలుపాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు వాసుదేవరావు, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, బాలసదనం సూపరింటెండెంట్ ప్రతిభ, వార్డెన్ రజిత, సీడబ్ల్యూవో భాగ్య, వార్డు ఆఫీసర్ పూజ, వార్డు కౌన్సిలర్ మల్లికార్జున్,రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, శిశు గృహ మేనేజర్ రాజు, సోషల్ వర్కర్ రాజారాం పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి



గజ్వేల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట అంధ్రజ్యోతి, జూలై 4: ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత నేత కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా శక్రవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కె. హైమావతి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ, డీడబ్ల్యూవో లక్ష్మీకాంత్ రెడ్డి, ఏవో అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు.

● **గజ్వేల్:** పదవులకు వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి కొనియాడారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు సర్దార్‌ఖాన్, మోహన్నగారి రాజు, సమీర్, నక్క రాములు, సుభేందర్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, లక్ష్మణ్, బెజుగామ శివారెడ్డి, దాచారం చిన్నారెడ్డి, దయ్యాల యాదగిరి, సబ్బని నరేశ్, కన్నా యాదవ్ తదితరులున్నారు.

పకృతిని కాపాడటం అందరి బాధ్యత



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఏజీఎం చైతన్యరావు, ఆర్ఐ సత్యం

సిద్దిపేట కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నారాయణ స్కూల్‌లో వనమహోత్సవం సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏజీఎం చైతన్య రావు, ఆర్ఐ సత్యం పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ప్రకృతిని కాపాడుకోవాలని, అందరు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రమ్య, డీన్ పరశురాములు, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, వైష్ణవి, ఏవో నరేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

మనబడి పై మమకారం పెంచుకోవాలి

కొండపాక, జూలై 4 (ఆంధ్రజ్యోతి):విద్యాబుద్ధులు నేర్పి మంచి జీవితాన్ని అందించిన చదువుకున్న బడిని మరువకుండా మమకారం పెంచుకోవాలని ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కొండపాక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విఠల్ నాయక్ ఆధ్వర్యంలో తల్లి ఒడి - మన బడి అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తల్లి ఒడి - మనబడి' కార్యక్రమం ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న సమాజం నుంచి మంచి స్పందన వచ్చిందని, సమాజ భాగస్వామ్యంతో అనేక వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం అభినందనీయులన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, కొండపాక గ్రామానికి చెందిన ఎన్నారై దొమ్మాట బాలకృష్ణారెడ్డి తన తల్లిదండ్రులైన దొమ్మాట విజయ ఇంద్రసేనరెడ్డి జ్ఞాపకార్థం దాదాపు రూ.50 వేల విలువ కలిగిన జిరాక్స్ మిషన్ అందించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

సిద్దిపేట అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి):పేద ప్రజలకు అండగా ఉంటామని లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకులు కనకమల్లయ్య విమర్శించారు.. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి లో మాట్లాడుతూ యువకులకు రాజీవ్ యువ వికాస పథకం తీసుకువచ్చి యువకులకు లేనిపోని ఆశలు కల్పించిందని విమర్శించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

8 బ్యారక్‌లతో జిల్లా జైలు

(5వ పేజీ తరువాయి)

గంటలు గస్తీ కాస్తారు. ముఖ్యంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఈ జైల్లో హై సెక్యూరిటీ బ్యారక్‌ను స్పెషిక్ మోడల్‌గా ఏర్పాటు చేశారు. ఈ అత్యంత భద్రత గల హై సెక్యూరిటీ బ్యారక్ హైదరాబాదులోని చంచల్‌గూడ జైల్లో మాత్రమే ఉంది. మళ్లీ ఇక్కడే ఏర్పాటు చేశారు. ఖైదీలు పారిపోకుండా జైలు చుట్టూ 6.2 మీటర్ల ఎత్తులో గోడను నిర్మించి దానిపై కరెంటు తీగలను ఏర్పాటు చేసి వాటిపై కంజైట్ వైర్ ను ఏర్పాటు చేశారు. 16 విభాగాల్లో 66 పోస్టులు జైల్లో 16 విభాగాల్లో మొత్తం 66 పోస్టులు మంజూరు చేశారు. ఒక డిప్యూటీ సూపరింటెండెంట్, ఒక సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఇద్దరు జైలర్లు, ఇద్దరు డిప్యూటీ జైలర్లు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఒక ఫార్మసిస్ట్, ఎలక్ట్రిషన్, ఒక చీఫ్ హెడ్ వార్డర్, 12 మంది హెడ్ వార్డర్లు, 34 మంది వార్డర్లు, ఒక డ్రైవర్, ఒక బార్బర్ మొత్తం 66 పోస్టులు మంజూరు చేశారు. జైలు ప్రాంగణం లోపల సిబ్బందికి క్వార్టర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఒక సూపరింటెండెంట్ కు, ఇద్దరు జైలర్లకు, మెడికల్ ఆఫీసర్‌కు, 12 మంది స్టాఫ్ వార్డర్‌లకు కలిపి 16 క్వార్టర్స్‌ను ఏర్పాటు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 9మందికి జరిమానా

● ఒకరికి ఎనిమిది రోజుల జైలు

సిద్దిపేట క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 9 మంది పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు రూ. 13,500జరిమానా విధించారు. వారిలో ఒకరికి జరిమానాతో పాటు 8 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు.

నర్సాయపల్లిలో ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

మద్దూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాయపల్లిలో గురువారం రాత్రి రెండు ట్రాక్టర్ల బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతులు చల్ల హన్మాంతారెడ్డి, చల్ల మల్లారెడ్డి ట్రాక్టర్లతో పొలం దున్ని రాత్రి ట్రాక్టర్లను పొలం వద్దే వదిలి ఇంటికి వచ్చారు. తెల్లవారి పొలం దగ్గరకు వెళ్లగా ట్రాకర బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

సిద్దిపేట రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ బీఎల్‌వోలకు సూచించారు. శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బూత్‌స్థాయి జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవి, ఆర్ఐ అర్జున్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో కాంగ్రెస్ భారీ ర్యాలీ



సిద్దిపేట నుంచి ఖర్గే సభ కోసం కాంగ్రెస్ నాయకుల భారీ ర్యాలీ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 4: దేశం మొత్తం కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ అధికారంలోకి తీసుకొచ్చే విధంగా చూస్తున్నారని ఆ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సభ విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలోనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ నుంచి మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లినవారిలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు, నాయకులు అజ్గర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

పాటల పల్లకిలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సిద్దిపేట కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్లో జరగబోయే పాటల పల్లకిలో 12గంటలు కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమ కళాకారులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల నర్సింలు కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కళాకారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బండకాడి గణేష్, ఉద్యమ కళాకారులు కళా ప్రసాద్, తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిన్నింటి దాసు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ చామలపై బీఆర్ఎస్ అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చేర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి పట్ల బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలోనే చేర్యాల అస్తిత్వం కోల్పోయిందన్న విషయాన్ని విస్మరించడం సిగ్గుచేటన్నారు. చేర్యాల రెవిన్యూ డివిజన్ విషయాన్ని ప్రస్తావించాలంటేనే జంకిన బీఆర్ఎస్ నేతలు ఈప్రాంత విచ్ఛిన్నానికి కారకులయ్యారని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు కాటం మల్లేశం, ఎండి ఖాజా, ఒగ్గు మల్లేశం, బుట్టి యాదగిరి, వెలగల దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్యాంప్ ఆఫీసా.. బీఆర్ఎస్ కార్యాలయమా?: బీజేపీ

గజ్వేల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయమా అని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సొమ్ముతో నిర్మించిన క్యాంపు కార్యాలయాన్ని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మార్చారని మండిపడ్డారు. పార్టీ మీటింగ్‌లు, ప్రెస్‌మీట్‌లు, జన్మదిన వేడుకలు చేస్తూ గెస్ట్‌హౌజ్‌లా మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా ఒక్కరోజు కూడా క్యాంపు కార్యాలయంలో అందుబాటులో లేరన్నారు. ప్రజా సమస్యలు చెప్పుకునేలా ప్రజలకు అధికారులు గానీ లేదా ఎమ్మెల్యే గానీ క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల మధు, నాగులు, కుమార్, రాజుగౌడ్, వెంకట్‌రెడ్డి, సందీప్, నరసింహ, మైస విజయ్ తదితరులున్నారు.

మతిస్థిమితం కోల్పోయిన బీజేపీ నాయకులు: బీఆర్ఎస్

గజ్వేల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి చెందిన గజ్వేల్ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని, వారికి ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స అవసరమని బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణాధ్యక్షుడు నవాజ్‌మీరా, ప్రధాన కార్యదర్శి బొగ్గుల సురేశ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బీజేపీ నాయకుల దాడిని ఖండిస్తూ గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అంటే సేవలకు నిలయమని, ప్రజలకు భరోసా, నమ్మకం అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్తే సమస్యలు తీరుతాయని, ప్రజలు ఇక్కడకు వచ్చి సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవడంతో పాటు పలు సమస్యలను వివరిస్తున్నారని తెలిపారు. ఇలాంటి క్యాంపు కార్యాలయంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని బీజేపీ నాయకులు మాట్లాడడం వారి మానసిక స్థితికి అద్దం పడుతుందన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందు, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఉమర్, నాయకులు శ్రీనివాస్, కరీం, కుమ్మరి పోచయ్య, కనకయ్య, మల్లేశం, తదితరులున్నారు.

కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

చేర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాలలో ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లా మార్చిన కలెక్టర్ హైమావతి తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం సీపీఎం నాయకులు స్థానిక అంబేడ్కర్ విగ్రహావరణలో నిరసన చేపట్టారు. అనంతరం సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. అధికారికంగా చేపట్టాల్సిన కార్యక్రమమైనప్పటికీ వేదికపై కాంగ్రెస్ నాయకులను అనుమతించి పార్టీ సభగా మార్చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొంగరి వెంకట్‌మావో, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల విద్యార్థులకు యూనిఫామ్ వితరణ

మర్కుక్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సర్కారుబడుల్లోని విద్యార్థులకు గ్లోబియన్ ఇండియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కర్కపట్ల కంపెనీ తరఫున హెచ్ఆర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యూనిఫామ్‌లను అందజేశారు. మండల పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాల, దామరకుంట ప్రాథమికోన్నత పాఠశాల, వరదరాజపూర్ ప్రాథమిక పాఠశాల, భవనందాపూర్ నాలుగు పాఠశాలలకు సుమారు 360 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున రెండు సాధారణ మరియు ఒక జత స్పోర్ట్స్ యూనిఫాం అందజేశారు.